



నిర్మల్ జిల్లాలో ఎరువుల పరిస్థితి (మెట్రిక్ టన్నులు)

## అమెరికా పర్యటనలో జాన్సన్ నాయక్

ఖానాపూర్, జూన్ 3 : అమెరికా దేశంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జూన్ 2న నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వైభవంగా ముగిశాయి. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ టెక్సాస్‌లో పర్యటించారు. అక్కడ మహాత్మాగాంధీ మెమోరియాల్ ప్లాజాను సందర్శించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారని జాన్సన్ నాయక్ 'నమస్తే తెలంగాణ'కు ఫోన్‌లో వివరించారు.


అమెరికాలోని టెక్సాస్ ప్లాజాలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జాన్సన్ నాయక్

### సార్లూ.. ఎరువులు లేవంటున్నరూ..



నాకు ఆలూర్ శివారులో 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఈ వానకాలం సీజన్‌లో ఆరెకరాల్లో సోయా, రెండెకరాల్లో పత్తి, 12 ఎకరాల్లో వరి సాగు చేయాలనుకుంటున్న. ఈసారి వానలు ముందే రావడంతో దుక్కులు కూడా పూర్తయినయ్. పంట వేసే ముందు జీలుగ వేద్దామంటే పీఏసీఎస్‌లో విత్తనాలు రాలేవంటున్నరు. అదును దాటిపోయిన తర్వాత జీలుగ విత్తనాలు వచ్చినా ఎవరికీ ఉపయోగం ఉండదు. వరి, సోయా విత్తనాలు కూడా లేవంటున్నరు. ఆయా పంటలను సాగు చేయాలంటే అడుగు మందుగా డీఏపీని చల్లాల్సి ఉంటుంది. అది కూడా రాలేదంటున్నరు. వానకాలం సీజన్ ప్రారంభమైనా నేటికీ సొసైటీల్లో ఎరువులు, విత్తనాలు ఏవీ అందుబాటులో లేవు. ఈసారి వానలు తొందరగా వచ్చాయని రైతులంతా సంతోషంగ ఉన్నరు. ఈ ప్రభుత్వం అవసరమైన ఎరువులు, విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందించలేక పోతున్నది. **- సోమ చిన్నయ్య, రైతు, ఆలూర్, సారంగాపూర్ మండలం.**

# ఎరువుల్లేవ్!


సోమవారం ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో పీఏసీఎస్ ఎదుట ఎరువుల కోసం పాదరక్షలను క్యూలో పెట్టిన రైతులు

**ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు**

- ముందస్తు వానలతో సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న
- ఎరువులు దొరకక ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- మొన్న ఆష్టా పీఏసీఎస్ ఎదుట పాదరక్షలతో బారులు
- నిన్న బాసర మండల పీఏసీఎస్ ఎదుట క్యూ


ఎరువులు, విత్తనాల కోసం నిర్మల్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణానికి భారీ సంఖ్యలో వచ్చిన రైతులు

నిర్మల్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : వానకాలం ప్రారంభమై ఆశించిన వర్షాలు కురుస్తున్న తరుణంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగు చేసేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తున్నారు. ఆరుతడి పంటలైన పత్తి, సోయా, మక్కను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో వైపు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఆయా పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. ఈ వానకాలంలో జిల్లా వ్యాప్తంగా 4.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం 49వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని రకాల ఎరువులు కలిపి 13,796 ఎంటీఎస్ మాత్ర మే అందుబాటులో ఉన్నాయి. అంటే 25 శాతం ఎరువులు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత శనివారం ముథోల్ మండలంలోని ఆష్టా పీఏసీఎస్‌లో కేవలం 400 బస్తాల యూరియా అందుబాటులో ఉండడం తో 150 మందికి పైగా రైతులు ఎగబడ్డారు. ఉన్న కొద్దిపాటి యూరియాను దక్కించుకునేందుకు రైతు లు పడరాని పాట్లు పడ్డారు. ఉదయం 6 గంటల నుంచే పీఏసీఎస్ కేంద్రం వద్ద తమ చెప్పులను క్యూ లో ఉంచారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం కూడా బాసర మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట కూడా రైతులు బారులుదీరారు. గత ఉమ్మడి రాష్ట్రంలో చెప్పులను క్యూ లో పెట్టడాన్ని చూశాం. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడు కూడా ఈ దుస్థితి రాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాతరోజులు వచ్చాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రైతులు తమ పంట భూముల్లో దుక్కి దున్నిన తర్వాత విత్తనాలు వేసేముందు అడుగు మందుగా డీఏపీ వేస్తారు. జిల్లాలో డీఏపీ ఆరు వేల మెట్రిక్ టన్నుల వరకు అవసరముంటుందని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలను పంపింది. అయితే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కేవలం 1,308 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నది. దీంతో డీఏపీ కొరత కారణంగా రైతులు సాగు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ముందుచూపు లేని కారణంగానే ఎరువుల కొరత సమస్యతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాగా.. పత్తి విత్తనాలు ఉండగా.. మక్క, సోయా, పప్పు దినుసుల విత్తనాలు లేవంటున్నారు. అలాగే పచ్చి రొట్ట విత్తనాలు కూడా లేవు.

### డీఏపీ లేదంటున్నరు..



నాకున్న ఆరెకరాల్లో మక్క, వరి, పసుపు, సోయా పంటలను వేసేందుకు భూమిని దుక్కి దున్ని చదును చేసి పెట్టిన. విత్తనాలు, ఎరువుల కోసం చిట్యాల్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లా. ఎనిమిది బస్తాలు డీఏపీ కావాలని అడిగితే స్టాకు లేదన్నరు. 20-20 ఎరువులు ఉన్నాయని, వీటితో సరిపెట్టుకొమ్మని చెబుతున్నరు. ఏ పంట వేసినా అడుగు మందుగా డీఏపీ వేస్తేనే మంచి దిగుబడి వస్తుంది. వరి విత్తనాలు కూడా రెండు, మూడు రోజుల్లో వస్తాయని అంటున్నరు. పచ్చిరొట్ట విత్తనాలు ఎక్కడ కూడా దొరుకుతలేవు. రైతుల కోసం ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కేంద్రాల్లో కూడా ఇంకా ఎరువులు, విత్తనాలు రాలేదు. గత 10 ఏళ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎరువులు, విత్తనాల కొరత ఏనాడూ రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబంధు కూడా ఇస్తలేరు. పంట పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయినయ్. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు అన్నీ కష్టాలే ఉన్నయ్.

**- రొడ్డ ప్రభాకర్, రైతు, ముజ్గి, నిర్మల్ మండలం**


బాసరలో ఎరువులు కొనేందుకు దుకాణానికి వచ్చిన రైతులు

### ప్రభుత్వానికి నివేదించాం



వానకాలం సీజన్‌కు సంబంధించి ఏ మేరకు విత్తనాలు, ఎరువులు అవసరమో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. ప్రస్తుతం సాగుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్ట విత్తనాలు రెండు, మూడు రోజుల్లో వస్తాయి. త్వరలోనే సొసైటీల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటాం. యూరియా, డీఏపీ కొంతమేర కొరత ఉన్నది. రెండో విడుత డీఏపీ రావాల్సి ఉన్నది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం.

**- అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్.**


సన్నాహక సమావేశంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న కార్యకర్త

## కాంగ్రెస్ కార్యకర్తల అసంతృప్తి

- సమూచిత స్థానం లభించడం లేదని ఆగ్రహం
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నాయకులు, కార్యకర్తనలు పట్టించుకోవడం లేదు..
- పోడు భూములను లాక్కుంటే జీవనాధారం కోల్పోతామని ఆవేదన

పెంబి, జూన్ 3 : కాంగ్రెస్ పార్టీ సంస్థగత, నిర్మాణ సన్నాహక సమావేశంలో కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ పరిశీలకులు యండి అవేజ్, చంద్రశేఖర్ గౌడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశానికి హాజరైన కార్యకర్తలు, రైతులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేసినప్పటికీ కార్యక్తలకు సమూచిత స్థానం కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, మండల నాయకులు, కార్యక్తలను పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వం పోడు భూములను లాక్కోవాలని చూస్తున్నదని, సమావేశానికి వచ్చిన పోడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనాధారమైన పోడు భూములు లాక్కుంటే రోడ్డున పడుతామని, పోడు భూముల్లో మొక్కలు నాటే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, నాయకులు తులాల శంకర్, స్వామి పాల్గొన్నారు.

## సన్నబియ్యానికి సర్వర్ కష్టాలు

- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- ఆరుసార్లు వేలిముద్ర.. పంపిణీలో జాప్యం

ఆదిలాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా మూడుల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా లబ్ధిదారులకు అవసరమయ్యే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేసిన రేషన్ దుకాణాలకు పంపిణీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 356 రేషన్ దుకాణాలు ఉండగా.. 1,92,757 రేషన్‌కార్డులు ఉన్నాయి. మూడు నెలల పంపిణీలో భాగంగా ప్రభుత్వం 12,600 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసింది. జిల్లాలో జూన్ 2 నుంచి బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు. బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు రేషన్ దుకాణాల ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తుంది. మూడు నెలల బియ్యం కోసం యంత్రంపై ఆరు సార్లు వేలిముద్ర ఉంచాల్సి వస్తుంది. దీంతో పంపిణీలో తీవ్రజాప్యం జరుగుతుండడంతో లబ్ధిదారులు దుకాణాల ఎదుట నిల్చోవాల్సి వస్తుంది. గత నెల వరకు కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున అందించేవారు. ఒకసారి వేలిముద్ర పెడితే సరిపోయేది. లబ్ధిదారులు 15 నిమిషాల్లో బియ్యం తీసుకుని పోయేవారు. ఇప్పుడు బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయం పడుతుంది.


ఆదిలాబాద్ పట్టణంలో శాంతినగర్ రేషన్ దుకాణం ముందు లబ్ధిదారులు


రేషన్ దుకాణాల ముందు వేచి చూస్తున్న లబ్ధిదారులు

### నిర్మల్‌లోనూ బారులే..

*నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో లబ్ధిదారులు దుకాణాల వద్ద బారులుదీరుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవడంతో 15-30 నిమిషాల సమయం పడుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. సర్వర్ అప్డేట్ కాకపోవడంతో వేలిముద్రలు తీసుకునే మిషన్లు మొరాయిస్తుండడంతో అవస్థలకు గురవుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని నాయుడువాడ, ఆదర్శనగర్, పలు రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి నెలకున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*

*- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, నిర్మల్.*